ఎరువుల కొరతను సృష్టించొద్దు : మెదక్ జిల్లా కలెక్టర్

హవేళీఘనపూర్, ఆగస్టు 8,ప్రభాతవార్త: ఎరువులు కృత్రిమ కొరతను సృష్టించొద్దని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా హవేలీఘన్పూర్‌లో తెలంగాణ ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు డిమాండ్‌కు అనుగుణంగా ఉన్న నిలువలను పరిశీలించారు, స్టాక్ వివరాలను డీలర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత సీజన్‌కు అనుగుణంగా జిల్లాలో తగినన్ని ఎరువులు విత్తనాలు ఉన్నాయని, కొంతమంది కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. రైతులతో స్వయంగా మాట్లాడుతూ వారికి కావలసిన సమాచారాన్ని అందించారు. రైతులు జిల్లాలో ముందస్తుగా ఎరువులు విత్తనాలు యూరియా డిఏపి తదితర ఫర్టిలైజర్స్‌లో వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉంచుకోవడం జరిగిందని తెలిపారు, కల్తీ విత్తనాలు అమ్మిన, అధిక ధరలకు విక్రయించిన, ప్రభుత్వం సూచించిన ప్రకారం సంబంధిత వ్యక్తులపై శాఖపరమైన చర్యలు తీసుకుని లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుందని అన్నారు, టాస్క్ ఫోర్స్ సిబ్బంది క్రమం తప్పకుండా సంబంధిత అధికారులతో కలిసి ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుబతండాలో తాగునీటి కటకట

నాగల్‌గిద్ద, ఆగస్టు 8, ప్రభాతవార్త: మండల పరిధిలోని కుబ తాండలో తాగునీటి కటకట నెలకొంది. గ్రామానికి మషన్ భగీరథ తాగునీరు వారం రోజుల నుంచి సరఫరా కాక పోవడంతో తండావాసులు వ్యవసాయ బావులను ఆశ్రయిస్తూ తాగునీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి తండాకు మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చూడాలని తండా వాసులు డిమాండ్ చేస్తున్నారు.

వ్యవసాయ బావుల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్న గిరిజనులు

సోషల్‌వెల్ఫేర్ పాఠశాలనుసందర్శించిన అదనపుకలెక్టర్ గరిమాఅగర్వాల్

మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనం పెట్టాలి

-అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

కొండపాక, ఆగస్టు 8, ప్రభాతవార్త

మండల పరిధిలోని దుద్దెడలో తెలంగాణ సోషల్‌వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాల, జూనియర్‌కళాశాలను శుక్రవారం జిల్లా అదనపుకలెక్టర్ గరిమా అగర్వాల్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆమె కళాశాల పరిసరాలను పరిశీలించారు. వంటకు ఉపయోగించే పదార్థాలు, బియ్యం, పప్పులు, నూనె, కూరగాయాలను ఆమె పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థు లకు భోజనం పెట్టాలని ప్రిన్సిపల్‌కు సూచించారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.

నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

-హుస్నాబాద్ ఎసిపి సదానందం

కోహెడ, ఆగస్టు 8, ప్రభాతవార్త:

ప్రజలను నేరుగా కలిసి సమస్యలను తెలుసుకోవడానికే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం(కార్డెన్ అండ్ సెర్చ్) నిర్వహించడం జరుగుతుందని హుస్నాబాద్ ఎసిపి సదానందం అన్నారు. మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని జ్యోతిరామ్‌నాయక్ తండాలో నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో పాల్గొని మాట్లాడారు. ప్రజలకు రక్షణ, సెన్సాఫ్ సెక్యూరిటీ భద్రతాభావం కలిగించడానికి ఈ ప్రోగ్రాం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళల రక్షణకు చట్టాలు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. నూతనచట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరాలపట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనాలకు సంబంధించి అన్ని కాగితాలతో పాటు లైసెన్స్, బీమా సౌకర్యం కలిగి ఉండాలన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలన్నారు. సైబర్ నేరం జరిగితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్లు 1930 లేదా డయల్ 100 కాల్ చేయాలన్నారు. ఈసందర్భంగా ఎలాంటి పేపర్లులేని 22 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ సిఐ శ్రీనివాస్, కోహెడ ఎస్ఐ అభిలాష్, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

ఏడుపాయలలో పల్లకి సేవ...

పాపన్నపేట, ఆగస్టు 8, ప్రభాతవార్త : ఏడుపాయల వనదుర్గ భవాని మాత సన్నిధిలో శుక్రవారం పౌర్ణమి పురస్కరించమని పల్లకి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకిలో ఊరేగించారు. ఆలయం నుండి ప్రారంభమైన ఈ ఊరేగింపు రాజగోపురం మీదుగా కొనసాగి మళ్లీ ఆలయంకి చేరుకుంది. ఈ ఊరేగింపులో ఆలయ, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, ప్రతాపరెడ్డి, బ్రహ్మచారి, నరసింహులు, నరేష్ ,బత్తిని రాజు వరుణాచారి తో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాజీ ఎంపిపి ఇంటికి వెళ్లిన మంత్రి

మాజీ ఎంపిపి రాజేశ్వర్ ఆరోగ్య గురించి తెలుసుకుంటున్న దామోదర

మునిపల్లి, ఆగస్టు 8(ప్రభాతవార్త): మండలంలోని బుధేరాలో మాజీ ఎంపిపి రాజేశ్వర్‌రావు కొంత కాలంగా ఆనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు.త్వరగా కోలుకోవాలని ఆయన ఆశించారు. అనంతరం తన సహోదరుడి కూతురి వివాహానికి రావాలని వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆయన వెంట సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్ నాయకులు వున్నారు.

బుధేరాలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతి

మునిపల్లి, ఆగస్టు 8(ప్రభాతవార్త): మునిపల్లి మండలం బుధరాలో అదనంగా మరో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. శుక్రవారం బుదేరాకు వచ్చిన సందర్భంగా వారు మంత్రికి తాము ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రితో మొరపెట్టుకున్నారు. బుధేరాలో ఒకే ఒక్క రేషన్ షాపు వుండటంతో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.బియ్యం కోసం బుధేరా చౌరస్తా నుంచి బుధేరా గ్రామానికి వెళ్లవలసి వస్తుందన్నారు. బుదేరా చౌరస్తాలో రేషన్ దుకాణం ఏర్పాటుచేసి తాము ఎదుర్కొంటున్న సమస్యను తీర్చాలన్నారు. ఈ సందర్భంగా సానుకూలంగా ఆయన స్పందించారు. బుధేరాలో రేషన్ దుకాణం ఏర్పాటుకు కృషి చేస్తానని హామినిచ్చారు.

మంత్రి దామోదరతో మండల కాంగ్రేస్ నాయకులు

వాగులు, బ్రిడ్జిలపై వెళ్లేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళీఘనపూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త: జిల్లా లోని వరద పరివాహక ప్రాంతాల్లో కాజ్‌వేలు, వాగులు, బ్రిడ్జిలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం హవేళీఘనపూర్ మండలం దూప్‌సింగ్ తండా కాజ్‌వే నిర్మాణపనులు సంబంధిత పంచాయతీరాజ్ ఈఈ గోపాల్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూప్‌సింగ్ తండా కాజ్‌వే రూ. 3 కోట్ల వ్యయంతో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా నిర్మాణ పనులు కొనసాగుతుందని, త్వరగా పనులు పూర్తిచేసి తండావాసులకు ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీలలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో నివాసాలు ఉండొద్దన్నారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా ప్రజలు కాచి చల్లార్చిన నీరునే తాగాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు ఎలాంటి నష్టం జరగలేదని, వర్షాలు ఆగేవరకు అన్ని శాఖలు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ ఓవర్‌ఫ్లో అవుతున్న చెరువులు వాగుల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులు వంకలు దాటనియ్యరాదని, ప్రవహిస్తున్న వరదనీటిలో వెళ్లకుండా చూస్తున్నారని తెలిపారు. ప్రజలు వరద ప్రవాహం ఎక్కువగాఉన్నపుడు రోడ్డు దాటడంలాంటివి చేసి ప్రమాదాలు తెచ్చుకోకూడదు అని తెలిపారు. ఇంకా భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా రెవెన్యూ యంత్రంగా మొత్తం ఎలాంటి ప్రమాదాలుజరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

దూప్ సింగ్ తండాలో కాజ్‌వే నిర్మాణపనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

ఓటరు జాబితా పకడ్బంధీగా ఉండాలి

హవేళీఘనపూర్, ఆగస్టు 8,ప్రభాతవార్త: రాబోయే పంచాయతీ ఎన్నికల్లో భాగంగా గ్రామం యూనిట్‌గా వార్డులవారీగా ఓటర్ల జాబితా మ్యాపింగ్ తయారు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. పంచాయతీల్లో ఓటరు జాబితా తయారీ మ్యాపింగ్‌లో భాగంగా హవేలీ ఘన్పూర్ ఎంపీడీవో కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. వార్డులు వారీగా ఓటర్స్ మ్యాపింగ్ విధానాన్ని సంబంధిత జడ్పీ సీఈఓ ఎల్లయ్యతో కలిసి పరిశీలించి ఇతర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో గ్రామ పంచాయతీ ఓటర్ నమోదు మ్యాపింగ్ ప్రక్రియ. ఎంపీడీవోల పర్యవేక్షణలో పంచాయతీ సెక్రెటరీ, కంప్యూటర్ ఆపరేటర్స్‌తో పగడ్బందీగా కొనసాగుతుందని చెప్పారు. దీనిలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, బిఎల్ఓలు రూపొందించిన ఓటర్ల జాబితాను టీపోల్ యాప్‌లో నమోదు చేసేందుకు ప్రతి పంచాయతీకి ప్రత్యేకంగా ఒక లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌ను అందించారన్నారు.కొత్తగా ఏర్పడిన ఒక్కో పంచాయతీలో ఆరు వార్డులకు తగ్గకుండా ఓటర్లను విభజించాలని అందులోనూ ఒక కుటుంబం ఒక వార్డులోనే ఉండేలా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య ఎంపీడీవోలు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేనిదే సెలవు మంజూరు చేయొద్దు

-వైద్యం అందించడంలో నిర్లక్ష్యంచేస్తే సహించేదిలేదు
-జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి(మద్దూరు): అనుమతి లేనిది సెలవు మంజూరు చేయొద్దని వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. మద్దూరు మండలంలో ఆమె శుక్రవారం విస్తృతంగా పర్యటించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మద్దూరు మండల కేంద్రంలోని పిహెచ్‌సిని ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెడికల్ ఆఫీసర్ మాత్రమే ఓపిరిజిస్టర్ రాయాలని, నర్సులు రాస్తూ మందులు ఇవ్వకూడదని హెచ్చరించారు. కాలం చెల్లిన మందులను వినియోగించొద్దని ఎప్పటి కప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. అలాగే లద్నూర్ పిహెచ్‌సిని తనిఖీ చేశారు. పిహెచ్‌సిలో ఒకే ఒక డాక్టర్ విధులకు హాజరు కావడం మిగతా ఇద్దరు హాజరు కాకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యం అందించడంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయాలన్నారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి అప్లికేషన్ల డిస్పోజల్ తహసీల్దార్ రహీమ్, ఎపిఓ వెంకటేశ్వర్లు ప్రక్రియను ఆమె పరిశీలించారు. కలెక్టర్ వెంట తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇల్లు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

అల్లాదుర్గంలో భారీ వర్షం

చెరువును తలపించిన బీటి రోడ్డు

అల్లాదుర్గం, ఆగస్టు 8, ప్రభాతవార్త: మండల కేంద్రంలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి బీటి రోడ్డు వాగును తలపించింది. గ్రామ శివారులోని బట్టికుంట చెరువు నుంచి పెద్ద పటేల్ చెరువులోకి నీరుచేరుతుంది. చేవెళ్ల, ఇటిక్యాల తదతర గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో ఆయా గ్రామాల నుంచి వరదనీరు అల్లాదుర్గం నుంచి 161వ జాతీయ రహదారికి పోయే మధ్యలోరోడ్డు పై నుంచి ఉధృతంగా మారడంతో అటుగా ప్రయాణించే ప్రయాణీకులు పాట్లు పడాల్సి వచ్చింది. అల్లాదుర్గంలోని కోమటికుట, బట్టికుంట చెరువులలోకి నీరు అధికంగా చేరుకోవడంతో చెరువులు నిండు కుండలా మారిపోయాయి. భారీ వర్షం కురియడంతో పత్తి, చెరుకు, వరి ంపటలకు కొంత వరకు మేలు జరిగిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాకాలంలో ఇదే పెద్దగా కురిసిన వాన అని ప్రజలు చర్చించుకోవడం కానవచ్చింది.

అల్లాదుర్గంలో బీటిరోడ్డుపై పారుతున్న వరద నీరు

కలెక్టర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు

టిఎన్‌జివోస్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్... ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన

మెదక్ టౌన్, ఆగస్టు 8, ప్రభాతవార్త : కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో భోజన విరామ సమయంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై టీఎన్జీవోస్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ నాన్ గెజిటెడ్, గెజిటెడ్, ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయిస్ యూనియన్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరసనలు తెలిపారు. ఈనెల 7వ తేదీన మెదక్ కలెక్టరేట్ కార్యాలయ ధర్నా చౌక్ వద్ద బిఆర్ఎస్ పార్టీ రైతు ధర్నా నిర్వహించారు. ఆ సమావేశంలో దుబ్బాక శాసనసభ్యులు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ మీద చేసిన అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ తీవ్రంగా ఖండించింది. ఈ వ్యాఖ్యలకు నిరసనగా ముక్తకంఠంతో ఖండిస్తూ తెలంగాణ ఉద్యోగ జేఏసీ శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం ప్రాంగణంలో పెద్దఎత్తున ఆందోళన చేశారు. మెదక్ జిల్లా టిఎన్జీవోస్ యూనియన్ అధ్యక్షులు దొంత నరేందర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రజా సంక్షేమ పథకాల పట్ల జవాబుదారితనం పారదర్శకత లక్ష్యంగా మెదక్ జిల్లాలో ప్రగతి పాలన అందిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ సమిష్టిగా కృషి చేస్తారని అటువంటి సమర్థ వంతమైన పాలన అందిస్తున్న జిల్లా కలెక్టర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేయడం సబబు కాదని తెలిపారు. ఇకముందు ఏ ప్రభుత్వ అధికారికైనా అన్యాయం జరిగితే వారిపై అనూష వ్యాఖ్యలు చేస్తే వారికి అండగా మెదక్ జిల్లా తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ అండగా ఉండటంతోపాటు వారిని రక్షించడం జరుగుతుందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ సెక్రెటరీ జనరల్ విటల్, టీఎన్జీవో సెక్రెటరీ రాజ్‌కుమార్, క్లాస్ ఫోర్త్ అధ్యక్ష కార్యదర్శులు జలగం ప్రసాద్, రిజ్వాన్ అలీ, ఎస్‌టియు అధ్యక్షులు రాజగోపాల్‌గౌడ్, టిటి యు అధ్యక్షులు శివయ్య, టిఎన్జీవో జిల్లా సహాధ్యక్షులు ఇక్బాల్ పాషా, కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఫజాలుద్దీన్, సంయుక్త కార్యదర్శులు శంకర్, శివాజీ, పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షులు జంగం నగేష్, గోపాల్, శ్రీహర్ష ధనుంజయ్, జిల్లా అధికారులు, పెద్దఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.

నిరసన చేస్తున్న టీఎన్‌జీఓస్ నాయకులు.

అల్లాదుర్గంలో డిగ్రీ కళాశాల కోసం అమరణ నిరాహారదీక్ష చేస్తున్న బిజెపి నాయకులు

డిగ్రీ కళాశాల మంజూరు చేయాలంటూ

బిజెపి నేతల ఆమరణ నిరాహార దీక్ష

-మూడు మండలాలను చార్మినార్ జోన్‌లో కలపాలి

అల్లాదుర్గం, ఆగస్టు 8, ప్రభాతవార్త: అల్లాదుర్గంలో డిగ్రీ కళాశాలను మంజూరు చేయడంతోపాటు అల్లాదుర్గం, టేక్మాల్, రేగోడ్ మండలాలను సిరిసిల్ల జోన్ నుంచి చార్మినార్ జోన్‌లో కలపాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతాపార్టీ మండల అధ్యక్షులు జిన్నా భాస్కర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు క్రిష్ణముదిరాజ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు శుక్రవారం ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. ఈ సందర్భంగా జిన్నా భాస్కర్, క్రిష్ణ ముదిరాజ్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి కల రాములు, జైపాల్, నీలి రమేష్, సాయి, బాలరాజు, ఎస్‌టి మోర్చా గణేష్ నాయక్, మహేస్ శివ, శ్రీకాంత్, బస్వరాజ్, లక్ష్మణ్, టేక్మాల్ మండల పార్టీ అధ్యక్షులు శంకర్, దళిత మోర్చా అధ్యక్షులు ఎర్ర కృష్ణ, ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ నాయక్, ప్రధాన కార్యదర్శి మధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొనేందుకు బయలెక్కిన విద్యార్థులు

ఖోఖో టోర్నిలో పాల్గొనేందుకు బయలు దేరిన భవన్స్ విద్యార్థులు

రామచంద్రాపురం, ఆగస్టు 8, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌లోని తుని ప్రాంతంలోని పాయకరావుపేటలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ పాఠశాలలో నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు కొనసాగే సౌత్ జోన్ సీబీఎస్ఈ క్లస్టర్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో తలపడేందుకు రామచంద్రాపురంలోని బెల్ టౌన్‌షిప్‌లోని భారతీయ విద్యా భవన్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు శుక్రవారం బయలుదేరి వెళ్లారు. గర్ల్స్, బాయ్స్ అండర్ 14, అండర్ 17 కేటగిరీలో 39 మంది భవన్స్ విద్యార్థులు పోటీపడనున్నారు. ఆయా రాష్ట్రాలకు చెందిన సీబీఎస్ఈ సౌత్‌జోన్ పాఠశాల విద్యార్థులు టోర్నమెంట్‌లో పోటీపడనున్నారు.పోటీలో పాల్గొనేందుకు వెళుతున్న విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ ఉమా శాస్త్రి ఆల్ ద బెస్ట్ చెప్పి చెప్పారు.

కంకోల్‌లో పండుగ సాయన్న జయంతి వేడుకలు

మునిపల్లి, ఆగస్టు 8(ప్రభాతవార్త):

మునిపల్లి మండలం కంకోల్‌లో పండగ సాయన్న జయంతి చవేడుకలు ఘనంగా జరుపుకున్నారు.పండుగ సాయన్న పేరు మీద అందోల్ నియోజక వర్గంలో భవనం నిర్మించాలని ముదిరాజ్ సంఘం నాయకులు కోరారు.భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కెటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభు ముదిరాజ్, కన్న బోయిని, శివకుమార్, జిల్లా ముదిరాజ్ సంఘం కార్యదర్శి రఘు ముదిరాజ్, శ్రీను, కోహీర్ మల్లేశం, మొగుడంపల్లి మల్లేశం, జహీరాబాద్ ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి విట్టల్ రమేష్, వీరశెట్టి సంగప్ప ముదిరాజ్ సంఘం గ్రామ సభ్యులు,ప్రజలు పాల్గొన్నారు.

గుండె పోటుతో బిఆర్ఎస్ నేత మృతి

చౌటకూరు, ఆగస్టు 8, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కొర్పోల్ గ్రామానికి చెందిన చందపురం శ్రీనివాస్ (55) గుండెలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో శ్రీనివాస్ చికిత్స అందుకుంటూ మృతి చెందాడు. శ్రీనివాస్ మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు శివకుమార్‌లు వాపోయారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 8, ప్రభాతవార్త : గంజాయి అమ్మడానికి ప్రయత్నిస్తున్న ఇద్దరు యువకులను అరెస్టుచేసి 140 గ్రాముల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులకు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన సిద్దరబోయిన అఖిల్(21), సిద్దరబోయిన పవన్‌కుమార్(20) ఇద్దరు కలిసి నాంచారుపల్లి శివారులోని బక్రిచెప్యాల రోడ్డు పక్కన పైపుల ఫ్యాక్టరీ వద్ద ఖాళీ స్థలంలో గంజాయి అమ్మడానికి ప్రయత్నిస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, త్రీ టౌన్ ఎస్ఐ చంద్రయ్యలు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. అఖిల్, పవన్‌కుమార్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా హైదారాబాద్‌లోని గుర్తు తెలియని వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపినట్లు తెలిపారు. అఖిల్, పవన్‌కుమార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. గంజాయి అమ్మిన కలిగి ఉన్న వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా గంజాయి అమ్ముతున్నట్లు గానీ గంజాయి కలిగి ఉన్నట్లు తెలిస్తే వెంటనే సిద్దిపేట టాస్క్‌ఫోర్సు పోలీసు అధికారులు 8712667445, 8712667446, 8712667447లకు సమాచారం అందించాలన్నారు.

వివరాలను వెల్లడిస్తున్న త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్

చీర్యాల లక్ష్మీనృసింహ్మ స్వామి ఆలయంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతం

చీర్యాల లక్ష్మీనృసింహ్మ స్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం చేస్తున్న చైర్మన్ మల్లారవు లక్ష్మీనారాయణ దంపతులు

కీసర,ఆగస్టు8,ప్రభాతవార్తః

శ్రీ.శ్రీ.శ్రీ చీర్యాల లక్ష్మీనృసింహ్మ స్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం శుక్రవారం ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ దంపతుల చేతుల మీదుగా వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఘనంగా జరిగింది. నగరం నలుమూలల నుండి భక్తులు ఆ వరలక్ష్మీ వ్రతంలో అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులను చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని వరలక్ష్మీ వ్రతంగా జరుపుకోవడం ఒక హిందూ ఆచారమన్నారు.వరలక్ష్మీ దేవత విష్ణు మూర్తి భార్యహిందూ మత ప్రకారం ఈ పండుగ చాలా విశిష్టమైనదన్నారు.వరాలు ఇచ్చే దేవతగా వరలక్ష్మీ దేవిని కొలుస్తారన్నారు.ఈ పూజలు ఆంద్రప్రదేశ్,తెలంగాణ,కర్ణాటక రాష్ట్రాల్లో అధికంగా స్త్రీలు కొలుస్తారన్నారు.ఈ పండుగ ముఖ్యంగా వివాహమైన మహిళలు నిర్వహిస్తారని అన్నారు.ఈ రోజున దేవతను పూజస్తే అష్టలక్ష్మీ పూజలకు సమానం అనే నమ్మకంతో కుటుంబ సభ్యులు కూడా పాలుపంచుకుంటారని తెలిపారు.అ దేవతను పూజస్తే అష్టైశ్వర్యాలు అయిన సంపద,భూమి, శిక్షణ,ప్రేమ,కీర్తి, శాంతి,సంతోషం,శక్తి వంటివి లభిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసమన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మల్లారపు శ్రీ హరిగౌడ్,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడే రాఖీ పండగ

నవాబుపేట ఆగస్టు 8,ప్రభాతవార్త :

విభిన్న ఇతిహాసాలను పాటిస్తూ జరుపుకునే అపురూపమైన పండగా రక్షాబంధన్ (రాఖీపండగ) నేడు రక్త సంబంధి కులను ప్రేమతో, అనురాగంతో, అప్యాతతో కట్టిపడేసే అపురూప ఘట్టం ఈ పండగా పట్టిం పులకు పోకుండా ఆడపడుచుల కళ్ళల్లో కనీళ్ళు రాకుండా ఆనందబాస్పలు వచ్చేవిధంగా వారి ని అక్కున చేర్చుకుని రాఖీ పండగను జరుపు కోవాలి. ఇంద్రుడు రాక్షసులతో యుద్ధం చే స్తూ ఓటమి అంచున ఉన్నప్పుడు ఆయన సతీమణి సచిదేవి నేనున్నాని రక్షా సూత్రాన్ని కట్టిందని దీంతో ఇద్రుడు ఘనవిజయం సాధిం చాడని దీనికి ప్రతీకగా ఈ పండగ జరుపుకుంటా రని ఓ కథనం ఉంది. అదేవిధంగా విష్ణదేవుడు బలిచక్రవర్తిని పాతాలానికి పంపుతున్నప్పుడు ఆయన భార్య లక్ష్మీదేవి బలిచక్రవర్తికి రాఖీ కట్టి వదిలిపెట్టమని వేడుకుందని ఈ నేపథ్యంలో వారి మధ్య సయోధ్యకుదరి బంధం బలప డిందని ఈ ఇతిహాసం ప్రకారం పండగ జరుపుకోవడం ఒక రివాజు, మహాభారతంలో ద్రౌపది కృష్ణడు చేతికి గాయమైతే ద్రౌపది చీరకోంగు చించి కట్టుకట్టడంతో రక్త సంబంధం మరింతగా బలపడిందని ఈ నేపథ్యంలో కృష్ణడు సదా రక్షణగా నిచిన తరుణంలో ఈ పంగను జరుపుకోవడానికి ఒక కథనం ఉంది. ఏదియేమైనా అన్న చెల్లెళ్ళు, అక్కా తమ్ముళ్ళ అనురాగానికి రక్తసంబంధానికి ప్రతీకైన ఈ పండగను సంబురంగా జరుపుకోవాలి. ఇదిలా ఉండగా రోజు రోజుకు రక్తసంబంధాలు పలచబడుతున్నాయని అన్న చెళ్ళల్ల మధ్య, అక్క తమ్ముళ్ళ మధ్య మనస్పర్థలు ఏర్పడి రాఖీ పండగకు దూరంగా ఉంటున్న సందర్భాలు కోంత ఇబ్బందిగా మారాయని పరిశీలకులు భావిస్తున్నారు. ఆస్తుల తగాదాలు బంధాలను అగాధంలోకి తోక్కేస్తున్నాయని వారి మధ్య అంతరాలు పెరిగి దూరాన్ని పాటించడంతో ఈ పండగ ఉనికి దెబ్బతింటోందని అంటున్నారు. తల్లి తండ్రుల ఆస్థిలో ఆడపడుచులకు చట్టపరంగా హక్కు ఉన్న తరుణం లో కొందరు ఆడ పడుచులు అన్నదమ్ములపై నాయ్యస్థానాలను ఆశ్రమించడం లాంటి చర్యలు చోటుచే సుకోవడం, ఇతరాత్ర సమస్యలు బంధాలని బలహీనం చేస్తున్నాయని పరిశీలకులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. చిన్నచాటి చేతలు గుర్తుచేసుకుని కలిసిమెలసి రాఖీ పండగను ఆస్వాధించాలని సూచిస్తున్నారు.

కరెంట్ షాక్‌తో యువ రైతు మృతి

యాలాల ఆగస్టు 8,ప్రభాతవార్త : కరెంట్ షాక్‌కు గురై ఓ యువ రైతు మృతి చెందాడు.ఈ దుర్ఘటన యాలాల మండలంలోని ముద్దాయిపేట గ్రామంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది.యాలాల ఎస్ఐ.విఠల్,కుటింభికులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి....ముద్దాయిపేట గ్రామానికి చెందిన పాలెపల్లి రమేష్(38)కు గ్రామంలో 10 గుంటల వ్యవసాయ భూమి ఉంది.ఈ పొలంలో వరి పంటసాగు చేస్తున్నాడు.శుక్రవారం ఉదయం తన పొలానికి నీళ్ల పెట్టడానికి వెళ్లాడు. బోరు మోటారునకు సంబంధించిన సర్వీస్‌వైర్ కిందపడిఉంది.అది గమనించిన ఆ రైతు వైరును సరిచేసే క్రమంలో కరెంటు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు.మృతునికి భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారు.నిరుపేద వర్గానికి చెందిన రైతు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నా యి.కుటీంబికుల పిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చస్తున్నారు.

విద్యుత్తుషాక్‌తో స్పాట్‌లోనే వ్యక్తి మృతి

పూడూరు, ఆగష్టు 8, ప్రభాతవార్త : ప్రమాదావషత్తు విద్యుత్తుషాక్‌తో ఒవ్యక్తి అక్కడిక్కడే మృతిచెందిన సంఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పరిధిలోని మేడికొండ గ్రామంలో చోటు చేసుకుంది.గ్రామస్తుల కథనం ప్రకారం పూడూరు మండలం పరిధిలోని మేడికొండ గ్రామానికి చెందిన కుర్వ మల్లయ్య(50) పెద్దఉమ్మెంతాల గ్రామానికి చెందిన పొలాన్ని కౌలుకు వేసుకొని పంటసాగు చేస్తున్నాడు.అయితే రోజు మాదిరిగానే గురువారం ఉదయం తనభార్య శివనీలతో కలిసి పొలం పనుల నిమిత్తం వెళ్లాడు.అదేరోజు సాయంత్రం భారీవర్షం కురుస్తుండడంతో పక్కనే ఉన్నవాగులో నీటి ఉధృతిపెరిగింది.దీంతో వాగుదాటలేక సుమారు 7గంటల ప్రాంతంలో ఇంటికి వెళ్లేందుకు పొలంనుండి బయలుదేరిన భార్యాభర్తలు ఇద్దరు తెలుగు నారాయణ మొక్కజొన్న పొలంనుండి వెళ్లేందుకు ప్రయత్నించారు.అయితే అప్పటికే పక్కపొలం రైతు మొక్కజొన్న పంటను పందుల బెడదనుండి కాపాడేందుకు గట్టుచుట్టూ విద్యుత్తు వైర్లను ఏర్పాటు చేశాడు.ఈ విషయం తెలియని సదరు భార్యభర్తలు ఇద్దరు మొక్కజొన్న పంటపొలం మీదుగా వెళుతుండగా,ప్రమాదావషత్తు మల్లయ్యకు విద్యుత్తు వైరుతాకి షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు.మృతుడు మల్లయ్యకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.మృతుడి బంధువుల పిర్యాదు మేరకు చెన్‌గోముల్ పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌షాక్ గురై ఆర్టిజన్ మృతి

రంగారెడ్డి జిల్లా ఆగస్టు8,ప్రభాతవార్త :

విద్యుత్ శాఖలో ఆర్టిజన్‌గా పనిచేస్తున్న ముదిగిరి అనిల్ గురువారం రాత్రి కురుస్తున్న వర్షాలకు విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్కు గురై మృతి చెందాడు. శాఖలో 2014లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా చేరి ప్రభుత్వం ఆర్టిజన్ గా క్రమబద్ధీకరించింది. అనిల్ శంషాబాద్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని చిన్న గోల్కొండ సంఘీగూడలో ఒక వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదును అటెండ్ట్ పనిచేస్తున్న తరుణంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కు గురై మృతి చెందాడు. విద్యుత్ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండ గ్రామానికి చెందిన మల్లయ్య కుమారుడు ముదిగిరి అనిల్ విద్యుత్ శాఖ శంషాబాద్ సెక్షన్ లో ఆర్టిజన్ గా పనిచేస్తున్నాడు. అనిల్ కు భార్య రజిత, పిల్లలు తేజస్వి, శివ లు ఉన్నారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ పి రత్నాకర్ రావు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రమేష్, అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ బాషా, విద్యుత్ శాఖ హెచ్ 82 యూనియన్ నాయకులు కిరణ్ కుమార్, రాజు, 1104 యూనియన్ నాయకులు శ్రీనివాస్, బాబురావు, నరేందర్ లు చేరుకుని జరిగిన సంఘటన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ... విధి నిర్వహణలో ఉన్న అనిల్ విద్యుత్ షాక్‌తో మృతి చెందటం బాధాకరమని ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. యాజమాన్యం అనిల్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. విధి నిర్వహణలో విద్యుత్ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమని వారి కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు.

ఘనంగా పండుగ సాయన్న జయంతి

తలకొండపల్లి ఆగస్టు8, ప్రభాతవార్త

తలకొండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం పండుగ సాయన్న జయంతి వేడుకలను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా మచ్చ పారిశ్రామిక సహకార సంఘం మండల అధ్యక్షుడు బొళ్ళ యాదగిరి అధ్యక్షతన జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన జన్మదిన సందర్భంగా పలువురికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం మాజీ మండల అధ్యక్షులు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మండల అధ్యక్షుడు బొల్లయాదగిరి ముదిరాజ్ మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం పేదల ఆకలి తీర్చేందుకు పండుగ సాయన్న పోరాటం వెలకట్టలేనిదని ఆయన అన్నారు. పేదోడి కడుపు నింపేందుకు భూసాములను, పెత్తందారులను ఎదిరించి పేదల కడుపు నింపిన మహనీయుడు పండుగ సాయన్న అని వారు అన్నారు. పండుగ సాయన్న అడుగుజాడల్లో నడుస్తూ ముదిరాజులందరూ ఐక్యంగా ముందుకు సాగాల ని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గ్రామ మాజీ అధ్యక్షుడు నూకం ముదిరాజ్, పద్మ దశరథ ముదిరాజ్, రామచంద్రయ్య, నరేష్ ,శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహసీల్దార్ ఆజం అలీ

కేశంపేట ఆగస్టు 8 ప్రభాతవార్త : ప్రకృతి వైపరీత్యాల దృశ్య ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేశంపే ట తహసిల్దార్ ఆజం అలీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల పరిధిలో కురు స్తున్న భారీ వర్షాల వల్ల ఎలాంటి విపత్తులు జరగకుండా ముందస్తుగా మండల ప్రధాన కార్యాల యంలో ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ ఆదేశా మేరకు మండల ప్రధాన కార్యాలయంలో నియంత్రణ గదిని ఏర్పాటు చేసినట్లు తహసిల్దార్ తెలిపారు. భారీ వర్షాల కారణంగా సంభవించే మానవ నష్టం, ఇంటి నష్టం, జంతు నష్టం, వంటివి జరగకుండా ఉండే విధంగా పర్యవేక్షించేందుకు ఇబ్బందిని నియమించామని, మండల పరిధిలో ఎలాంటి విపత్తులు జరిగిన, జరిగేందుకు అవకాశం ఉన్న అలాంటి సమాచారాన్ని మా సిబ్బందికి తెలియపరచాలని ఆయన అన్నారు. ఆర్ ఐ చెన్నకేశ వులు, రికార్డ్ అసిస్టెంట్ జంగయ్య సీనియర్ అసిస్టెంట్ మచ్చేందర్, జూనియర్ అసిస్టెంట్ శివ, సీని యర్ అసిస్టెంట్ మహేష్, జూనియర్ అసిస్టెంట్ జంగేశ్, లను నియమిస్తున్నట్లు తహసిల్దార్ తెలిపారు మండలంలో ఎలాంటి విపత్తులు జరిగిన 99480 44523, 99121 70411, 9398094490, 7799363553, 9441579527, 9848206029. ఈ నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందిం చాలని ఆయన సూచించారు.

బూత్‌స్థాయి ఏజెంట్లను తప్పనిసరి నియమించుకోవాలి

-జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 8, ప్రభాతవార్త ః

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాలకు బూతు స్థాయి ఏజెంట్ల ను తప్పని సరిగా నియమించుకోవాలని జిల్లా కలెక్టర్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో పోలింగ్ స్టేషన్‌ల హేతుబద్ధీకరణకు సన్నాహాలు, కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటుతో పాటు భవనాల గుర్తింపు తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల్లో బూతు స్థాయి ఏజెంట్ల ప్రాధాన్యత ఎంతో అవసరమని, వంద శాతం ఏజెట్ల నియామకానికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఏజెంట్ల ని యామకం ఆగస్టు 14 లోపు పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రంలో 1200 మంది కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉండకూడదనే నిబంధనల మేరకు ఎన్నికల కమిషన్ అ నుమతి మేరకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయవలసి ఉంటుందని ఆయన తెలిపారు. జిల్లాలో 118 పోలింగ్ కేంద్రాలలో 1200 కు పైగా ఓటర్లు ఉన్నట్లుగా గుర్తించి సిద్ధంగా ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు. ఓటరు జాబితా లో మార్పులు, చేర్పులు చేసుకునే విధంగా ప్రజలకు చేరే విధంగా చూడాలని కలెక్టర్ సూచించారు.100 సంవ త్సరాలు పూర్తయిన ఓటర్లను గుర్తించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కుటుంబం లోని ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, ఏవైనా సందే హాలు, డూప్లికేట్ ఓటర్ల వివరాలతో పాటు 4 నియోజక వర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలని కలెక్టర్ సూ చించారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నేమత్ అలీ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి రాంరెడ్డి,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు మెరుగైన ఆరోగ్యసేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి

-మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి

మేడ్చల్ జిల్లా పరిధిలోని జవహర్‌నగర్ పిహెచ్‌సిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ మనుచౌదరి దృశ్యం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 8, ప్రభాతవార్త

పేద ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమ త్తంగా ఉండాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి పేర్కొ న్నారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కాప్రా మండలంలోని జవహర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మి కంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగ ఆరోగ్య కేంద్రంలో ఎఎన్‌సి కేసులు ఎన్ని మిస్ అవుతున్నాయని, పరీక్షలకు రానివారిని ఏ విధంగా గుర్తిస్తున్నారని గైనకాలజిస్ట్ డాక్టర్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎఎన్‌సి పరీక్షలకు రానివారిని గుర్తించి ఆశావర్కర్లు ఎఎంసిల ద్వారా వారికి కౌన్సిలింగ్ ఇప్పించాలని అన్నారు. సి సెక్షన్ వరకు వెళ్లకుండ ముందు జాగ్రత్తలు తీసుకునేలా పేషంట్లకు జాగ్రత్తలు, సలహా లు, సూచనలు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ల్యాబరేటరీని పరిశీలించి రోజుకు ఎన్ని పరీక్షలు చేస్తున్నారని, ఇక్కడ ఎన్ని పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, ఇక్కడ లేని పరీక్షలను ఎక్కడ చేయిస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓపి పేషంట్ల నమోదు రిజిస్ట్రేషన్ హిస్టరీ అప్‌డేట్ అవుతుం దా అని ఆరా తీశారు. కలెక్టర్ ఈ హాస్పిటల్‌లోని అన్ని విభాగాలను తిరిగి పరిశీలించారు. అవసరమైన మరమ్మతు పనులకు ఎస్టిమేట్‌వేసి తనకు పంపాలని మెడికల్ ఆఫీసర్‌కు సూచించారు. రోగులకు అందిస్తున్న సేవలను,, సిబ్బంది హాజరు పట్టికను, ఓపి రిజిష్టర్, డెలివరీ రిజిష్టర్స్‌ను పరిశీలిం చారు. పేద ప్రజలకు ఆరోగ్యసేవలు అందించేందుకు వైద్యశా ఖను బలోపేతం చేస్తుందని అన్నారు. సీజనల్ వ్యాదులను దృష్టిలో ఉంచుకుని వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉందని జిల్లాలోని ఆరోగ్యకేంద్రాలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది సమయపాలన, మెరుగైన వైద్య సేవలు అం దించటంలో ఆదర్శంగా ఉంటున్నారని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సి.ఉమాగౌరి, మెడిక ల్ ఆఫీసర్ సుష్మ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ డెయిరీ పాల ఉత్పత్తులపై అవగాహన

కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు, పాడి రైతులు

యాచారం,ఆగస్టు8, ప్రభాతవార్త :

యాచారం మండల పరిధిలోని గున్ గల్ గ్రామంలో శుక్రవా రం పి.వి.నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాల యం రాజేంద్రనగర్, హైదరాబాద్, ఆధ్వర్యంలో శాస్త్రీయ డెయిరీ సాగు పాల ఉత్పత్తుల విలువ జోడింపు పై ఆర్వేలి యా రాయబారి కార్యాలయం ప్రత్యక్ష సహాయ కార్యక్రమంలో భాగంగా ఒక రోజు శిక్షణా కార్యక్రమం విజయవంతంగా నిర్వ హించారు. ఈ శిక్షణ కార్యక్రమం ముఖ్యంగా గ్రామీణ మహిళలు యువతలో శాస్త్రీయ పద్ధతుల డెయిరీ సాగు అవగాహనను పెంచడం, పాల ఉత్పత్తుల విలువ జోడింపు ద్వారా ఆదాయ మార్గాలు అనే అంశంపై కార్యక్రమం నిర్వ హించారు.ఈ కార్యక్రమంలో డా. కె. కొండల్ రెడ్డి, మాజీ రిజిస్టర్ పశువైద్యవిశ్వవిద్యాలయం మాట్లాడుతూ.. శాస్త్రీయ పద్ధతిలో పాడి పశువుల పెంపకం పాల పదార్థాల తయారీపై పాడి రైతులకు శిక్షణ అవగాహనా కల్పించడం ఏర్పాటు చేశారు.డా. టి రఘునందన్, ఫార్మర్ డీన్ ప్రొఫెసర్, శాస్త్రీయ పద్ధతుల ఆధారంగా ఆధునిక డెయిరీ ఫారాలను స్థాపించడంపై సూచనలు అందించారు. పశుపోషణ, షెడ్ నిర్మాణం, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వంటి అంశాలను వివరించారు.డా. ఎం. శశికుమార్, ప్రొఫెసర్ విభాగాధిపతి,డా. ఎం. సాహిత్య రాణి, అసోసియేట్ ప్రొఫెస ర్, లైవ్‌స్టాక్ ప్రొడక్ట్స్ టెక్నాలజీ విభాగం వారు ఖోవా, కలా కండ్, పనీర్, చన్నా, రసగుల్లా, రసమలై, బసుంది, మజ్జిగ, లస్సీ, ఫ్లేవర్డ్ మిల్క్, వే డ్రింక్స్ వంటి విలువ ఆధారిత పాల ఉత్పత్తుల తయారీపై వర్క్‌షాప్‌లు నిర్వహించారు. పరిశు భ్రత, నాణ్యత ప్రమాణాలు, మార్కెటింగ్ అవకాశాలపై ప్రా ముఖ్యత నిచ్చారు. జి. రత్నాకర్, ప్రాజెక్ట్ మేనేజర్, సేవా స్ఫూర్తి ఫౌండేషన్,"డెయిరీ రంగంలో గ్రామీణ మహిళల సాధి కారత" అనే అంశంపై ప్రేరణాత్మక ప్రసంగం అందించారు. పాల ఉత్పత్తి, పశుపోషణ వంటి కార్యకలాపాల్లో మహిళల పాత్రను కొనియాడుతూ, శాస్త్రీయ పద్ధతులు, ప్రభుత్వ పథకాల వినియోగం, వ్యాపార నైపుణ్యాల సాధన ద్వారా స్వ యం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని ప్రోత్సహిం చారు.కార్యక్రమం ముగింపులో మహిళ పాడి రైతులకు ధృవపత్రాలు పంపిణీ చేయబడినవి. ఈ శిక్షణా కార్యక్రమం రైతుల్లో కొత్త ఆవిష్కరణల పట్ల ఆసక్తిని కలిగించి, శాస్త్రీయ డెయిరీ సాగు ద్వారా ఆదాయాన్ని పెంచే దిశగా ఒక మంచి మార్గాన్ని చూపించింది. ముఖ్యంగా మహిళల ఆర్థిక సాధికా రతకు ఇది ప్రేరణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సంధ్య , పశు గణన సహాయకులు కృష్ణ, రైతులు శ్రీలత, అలివేలు,బోడకొండ రైతులు లచ్చిరామ్ , మరియు మహిళా పాడి రైతులు గ్రామస్తులు కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

భూభారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తులు పరిష్కరించాలి

-మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి
-మూడుచింతలపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

మూడిచింతలపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంను సందర్శించి తనిఖీ చేసిన మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి,పాల్గొన్న తహసీల్దార్ వెంకటనర్సింహ్మారెడ్డి, తదితరుల దృశ్యం

శామీర్‌పేట, ఆగస్టు 8, ప్రభాతవార్త

భూ భారతి, రెవెన్యూ సదస్సులో వచ్చిన ధరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవా రం మూడుచింతలపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంను ఆయన ఆకస్మికంగా సందర్శించి భూభారతి, రెవెన్యూ సద స్సులో వచ్చిన ధరఖాస్తుల పరిష్కార దిశలో భాగంగా తహసీల్దార్ కార్యాలయంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ భూ భారతి ఆన్‌లైన్ ద్వారా, రెవెన్యూ సదస్సులలో ఇచ్చిన ధరఖా స్తులు ఎన్ని, ఎంత వరకు పరిష్కారం అయినట్లు తహసీల్దార్ వెంకట నర్సింహ్మారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ధరఖాస్తుల పరిష్కారానికి జరుగుతున్న జాప్యానికి గల కారణాలను ఆయన పరిశీలించారు. సాంకేతికరపరమైన ఇబ్బందులు ఉన్న ట్లు అయితే క్లియర్ చేసుకోవాలని, ధరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదే శించారు. ఆన్‌లైన్ మాన్యువల్‌గా పెండింగ్‌లో ఉన్న ధరఖాస్తు లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మూడుచిం తలపల్లి మండల తహసీల్దార్ వెంకటనర్సింహ్మారెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో భారీ వర్షం..!

-అలుగు పారిన అక్కమ్మ చెరువు
-చేపల కోసం జనజాతర

నందిగామ నుండి వీర్లపల్లి వెళ్లే రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు

నందిగామ ఆగస్టు 8 ప్రభాతవార్త

నందిగామ మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. జల్లులతో ప్రారంభమైన వాన ఒక్కసారిగా కుండపోతను తలపించింది. వాగులు, వంకలు, చిన్న చిన్న గుంతలు నుండి పంట చేళ్లపై ప్రవహించా యి. పై నుండి వర్షపు నీటి ప్రవాహంతో నందిగామ నుండి వీర్లపల్లి వెళ్లే రహదారికి రాకపోకలు స్తంభించాయి. వర్షపు నీటితో అక్కమ్మ చెరువు అలుగు పారడంతో జనం సంబరాలు జరుపుకున్నారు. నీటి ప్రవాహానికి చేపలు ఎదిరిగడంతో చుట్టుపక్కల ప్రజలు చేపల వేటకు దిగడంతో జన జాతరను తలపించింది. అరకిలో నుండి సుమారు 12 కిలోల దాక చేపలు దొరకడంతో భోజన ప్రియుల ఆనందం అవధులు దాటింది.

కెటిఆర్‌కి రాఖీ కట్టిన లగచర్ల మహిళా రైతులు..

కెటిఆర్‌కి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలుపుతున్న లగచర్ల మహిళా రైతులు

దుద్యాల్, ఆగస్టు 8, ప్రభాతవార్త: మండల పరిధిలో ఏర్పాటు చేయ నున్న పారిశ్రామిక వాడ భూసేకరణలో బాధిత గిరిజన తండాల మహిళా రైతులు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిలకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. పులిచెర్లకుంట తండా కు చెంది న జ్యోతి మాట్లాడుతూ, ప్రభుత్వం మా భూములు గుంజుకొని నా భర్త ను జైలుకు పంపి మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తే కేటీఆర్ మాకు అన్న లాగ అండగా నిలబడ్డాడు అని అన్నారు. నిండు గర్భిణిగా ఉన్న నా క్షేమాలన్ని చూసుకున్నాడు. నా బిడ్డకు మేనమామ లాగ భూమి నాయక్ అని పేరు పెట్టాడని, కేటీఆర్ నాకు దేవుడు ఇచ్చిన అన్న అని అన్నారు. కార్యక్ర మంలో గిరిజన మహిళ రైతులతోపాటు కోట్ల మహిపాల్, లగచర్ల సురేష్, మాజీ సర్పంచ్ అనిత సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలి

-తూంకుంట మున్సిపల్ కమిషనర్ ఎంఎన్ఆర్ జ్యోతి
-ఇంటి పన్ను 2,92,156రూపాయలు ఒకేసారి చెల్లింపు అభినందనీయం



.దేవరయాంజాల్‌కు చెందిన దాసరి గోపాల్‌రెడ్డి ఇంటిపన్నును చెల్లించిన దృశ్యం

శామీర్‌పేట, ఆగస్టు 8, ప్రభాతవార్త

ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాల్టీ అభివృద్ధికి సహకరించాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ ఎంఎన్ఆర్ జ్యోతి కోరారు. మున్సిపాల్టీ పరిధిలోని దేవరయాంజాల్‌కు చెందిన దాసరి గోపాల్‌రెడ్డి తమ ఇంటి పన్ను 2,92,156రూపాయలు ఒకేసారి చెల్లించటం జరిగిందని అభినందనీయమ ని ఆమె అన్నారు. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలోని దేవరయాంజాల్‌కు చెందిన దాసరి గోపాల్‌రెడ్డి మున్సిపల్ బిల్‌కలెక్టర్ రాంరెడ్డికి ఇంట

జిల్లాలో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

-భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న సంతోషిమాత

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక పట్టణాలతోపాటు గ్రామీణప్రాంతాలలో శ్రావణమాసం మూడో శుక్రవారం వరలక్ష్మీవ్రతాలు భక్తిశ్రద్ధలతో వైభవంగానిర్వహించారు.జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామి, పొట్లపల్లి శివలయం, నాచారం లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయంతోపాటు సిద్దిపేట పట్టణంలోని సంతోషిమాత, వేంకటేశ్వర, శరభేశ్వర, కోటిలింగాల, రేణుకాఎల్లమ్మ, శిద్ధి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి దేవాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శు క్రవారం సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని సంతోషిమాత అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్యహోమంలో భాగంగా సర్వ దోష నివారణకోసం హోమం, అమ్మవారికి ఉద్యాపన పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీచైర్మన్ డాక్టర్ మాంకాల నవీన్ కుమార్, కార్యనిర్వహణాధికారి శ్రీధర్‌రెడ్డి, మాజీ చైర్మన్లు తమ్మిశెట్టి వీరేశం, బచ్చు రమేష్, కాచం కాశీనాథ్, గందె ఎల్లేశం, అర్చకులు రామకృష్ణ, మధుసూదన్‌శర్మ, మాజీ ధర్మకర్తలు సత్యంగౌడ్, రాము, సంతోష్, నాగరాజు, ప్రభాకర్, సువర్ణ, భక్తులు వాణి, పద్మ, ఆలయ సిబ్బంది శంకర్, వాసు, శ్రీనివాస్, సేవకులు హరి, వేణు, నరసింహ, సంతోషిమాత సేవాసమితి సభ్యులు, సంతోషిమాత మాతృమండలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సర్కార్‌తోనే అభివృద్ధి

-సిద్దిపేట పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు అత్తు

అజ్మీర్‌లో చాదర్‌ను సమర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 8, ప్రభాతవార్త:

తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ సర్కార్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. మరో 10 యేళ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరుతూ అజ్మీర్‌లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి చాదర్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని దశలవారీగా అమలుచేస్తూ సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన సాగుతుందన్నారు. మహిళల అభివృద్ధికి సిఎం రేవంత్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనను చూసి ఓర్వలేక బిఆర్ఎస్ విమర్శలు చేస్తుందన్నారు. బిసి బిల్లును కేంద్ర సర్కారు అడ్డుకోవడం సరికాదని, కాంగ్రెస్ సర్కారు బిల్లును సాధించి తీరుతుందన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపికి ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గయాజుద్దీన్, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి హర్షద్ తదితరులు ఉన్నారు.

నర్సారెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలి

-దళిత మహిళల డిమాండ్

కొండపాక, ఆగస్టు 8, ప్రభాతవార్త:

కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము విజయ్‌కుమార్ సంఘటనలో మాజీ ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని శుక్రవారం కొండపాక మండలకేంద్రంలో దళిత మహిళలు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. నర్సారెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలంటూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ దళితుల పక్షపాతి అనుకున్నామన్నారు. దళితులు గెలిపించుకున్న కాంగ్రెస్ పార్టీలో దళితులకే రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. నర్సారెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేసి కాంగ్రెస్ అధిష్ఠానం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్‌చేశారు. నర్సారెడ్డికి వ్యతిరేకంగా విజయ్‌కుమార్‌కు అనుకూలంగా ప్లకార్డులు పట్టుకొని ర్యాలీలో నినాదాలు చేశారు. నర్సారెడ్డిని అరెస్ట్ చేయకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో లచ్చవ్వ, అంజలి, నాగవ్వ, లక్ష్మి, రంగవ్వ, యాదవ్వ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో ఘనంగా వరలక్ష్మీవ్రతాలు

ప్రత్యేక పూజలందుకున్న వరలక్ష్మీమాత

నర్సాపూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త:

అతి పవిత్రమైన శ్రావణమాసంలో మూడవ శుక్రవారం పురస్కరించుకొని నర్సాపూర్ మున్సిపాలిటీపరిధిలో ప్రతి ఇంట వరలక్ష్మీవ్రతాలను భక్తి శ్రద్ధలతో నియమనిష్ఠలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా మహిళలు ఉదయాన్నే స్నాన సంధ్యాది కృత్యాలను తీర్చుకొని కొత్తబట్టలు ధరించి వరలక్ష్మీవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా మహిళలు ఒకరికొకరు పసుపు కుంకుమ తాంబూలాలను ఇచ్చిపుచ్చుకుంటూ వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా జరుపుకున్నారు.

వెల్దుర్తిలో ఘనంగా వరలక్ష్మీవ్రతాలు

వరలక్ష్మీవ్రతం సందర్భంగా పూజలందుకున్న వరలక్ష్మీమాత

వెల్దుర్తి, ఆగస్టు 8, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన వెలుగుతోపాటు పలుగ్రామాల్లో మహిళలు ప్రతి ఏడు వచ్చే శ్రావణమాసంలో వరలక్ష్మీవ్రతాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే వరలక్ష్మీవ్రతాలను చేసుకోవడంద్వారా మంచి జరుగుతుందని ఆలోచనతో మహిళలు వరలక్ష్మి అమ్మవారిని ఏర్పాటుచేసి అమ్మవారికి అలంకరణ నిర్వహించి పువ్వులు పళ్లతోపాటు ఫలహారాలు సమర్పించారు. దీంతో తోటి మహిళలకు సైతం వాయినాలను సమర్పిస్తూ వారి మొక్కలను తీర్చుకుంటున్నారు.

తనకు రాజకీయ ఓనమాలు నేర్పింది దళితులే

-ఎస్సీసెల్ పట్టణ అధ్యక్షుడు శివులు నివాసంలో అల్పాహారం చేసిన నర్సారెడ్డి

గజ్వేల్, ఆగస్టు 8, ప్రభాతవార్త:

తనకు రాజకీయ ఓనమాలు నేర్పించింది దళితులే అని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రజ్ఞాపూర్‌లోని ఎస్సీసెల్ పట్టణ అధ్యక్షుడు ఈదుగాని శివులు నివాసంలో కార్యకర్తలతోకలిసి అల్పాహారంచేశారు. ఈసందర్భంగా తూంకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ తనను కొందరు దళితవ్యతిరేకిగా పనిగట్టుకొని ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. తన రాజకీయ జీవితం వర్గల్ మండలకేంద్రంలోని దళిత వాడలోనే ప్రారంభమైనట్లు గుర్తుచేశారు. తనకు వారు రాజకీయ ఓనమాలు నేర్పించారని, తనను కడుపులోపెట్టుకొని కాపాడుకున్నట్లు స్పష్టం చేశారు. వర్గల్ సర్పంచ్‌గా తన రాజకీయ జీవితం ప్రారంభించి ఎమ్మెల్యేగా అంచెలంచెలుగా ఎదిగిన నాకు దళితులే తోడు ఉన్నారన్నారు. వర్గల్‌లో తన చిన్నప్పటి నుండి 40 దళిత కుటుంబాలు అండగా ఉంటూ రాజకీయంగా ఎదిగేందుకు తోడ్పాటునందించారన్నారు. సర్పంచ్ స్థాయి నుంచి ఎమ్మెల్యేగా ఎదగడానికి గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు అన్ని విధాలుగా సహకరించారని, నేను ఎప్పుడూ వ్యక్తిగత విమర్శలు ఎవరిపై చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యం పంపిణీలో భాగంగా దళితుల ఇళ్లలో సహపంక్తి భోజనాలు

ఎస్సీసెల్ పట్టణ అధ్యక్షుడు శివులు నివాసంలో అల్పాహారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, నర్సారెడ్డి

చేసినట్లు స్పష్టంచేశారు. రాజకీయ ఎదుగుదలతో విమర్శలు సహజమని, అయితే అందులో ఎంతో కొంత నిజం ఉండాలన్నారు. రాజకీయాల్లో ఆటుపోట్లు, కష్టసుఖాలు సహజమని, తనపై వచ్చిన అపవాదు తొలగించుకోవడం తన బాధ్యత అని అన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి, ఎఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, మాజీ ఎంపిపి మోహన్, ఎఎంసి డైరెక్టర్లు అక్కారం యాదగిరి, డాక్టర్ వాహిద్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, బెజుగామ శివారెడ్డి, కొండ పోచమ్మ డైరెక్టర్ గుండు లక్ష్మణ్, శ్రావణ్, మన్నె అరుణ్‌కుమార్, 3వవార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెర్క నాగరాజు, నక్క రేగొండ, మైనార్టీ జిల్లా నాయకుడు అజ్గర్, గుంటుకు శ్రీనివాస్, గాడిపల్లి శ్రీనివాస్, సొక్కం సురేష్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

-ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

బెజ్జంకి, ఆగస్టు 8, ప్రభాతవార్త:

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలపరిధిలోని ముత్తన్న పేట గ్రామంలో శుక్రవారం రూ.18 లక్షలతో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 50మంది లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ పులి కృష్ణ, వైస్‌చైర్మన్ చిలువేరు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిడిఓ కడవెర్గు ప్రవీణ్, తహసీల్దార్ చంద్రశేఖర్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఒగ్గు దామోదర్, ముక్కిన రత్నాకర్‌రెడ్డి, బైర సంతోష్, అక్కరవేణి పోచయ్య, గూడెల్లి శ్రీకాంత్, శానగొండ శరత్, మిట్టపల్లి చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు

-క్యూలో చెప్పులు పెట్టిన రైతులు

యూరియా కోసం క్యూలైన్ కట్టి చెప్పులు పెట్టిన రైతులు

నంగునూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త:

ఆరుగాలం కష్టపడి దేశానికి అన్నం పెట్టే రైతులకు యూరియా కోసం తిప్పలు మాత్రం తప్పడం లేదు. మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో శుక్రవారం రైతులు యూరియా కోసం పిఏసిఎస్ వద్ద ఉదయం నుంచి క్యూలైన్‌లో నిలబడడంతోపాటు మరి కొంతమంది రైతులు చెప్పులను క్యూలైన్‌లో పెట్టి యూరియా కోసం వేచి చూశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటినుంచి నేటివరకు యూరియా కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎదురు చూడాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ఒక ఎకరానికి ఒక యూరియా బస్తా ఇవ్వడంతో రైతులు భారీగా యూరియా కోసం లైన్‌లో బారులు తీరారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు తగుచొరవ తీసుకొని రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

బిసి బిల్లుకు ఆమోదం తెలపకుంటే బిజెపి బిసిల వ్యతిరేకులుగా మిగులుతుంది

-మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరకుల శివప్ప



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు శివప్ప

సిద్దిపేట రూరల్, ఆగస్టు 8, ప్రభాతవార్త:

సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ సర్కారు బిసిలకు 42శాతం రిజర్వేషన్లను సాధించి తీరుతుందని కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు, సిద్దిపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరకుల శివప్ప అన్నారు. శుక్రవారం ఆయన సిద్దిపేటలో విలేకరులతో మాట్లాడారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడానికి సిఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తుంటే బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు అడ్డు తగులుతున్నాయని మండిపడ్డారు. 10శాతం ముస్లింలకు రిజర్వేషన్లు తీసివేయాలని బిజెపినాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలోని బిసిలలో అన్నివర్గాలకు న్యాయం చేయడానికి సర్కారు 42శాతం రిజర్వేషన్ల బిల్లు తెస్తే ముస్లింలకు 10శాతం రిజర్వేషన్లు పోతాయని బిజెపి నాయకులు మాట్లాడడం అర్థంపర్థం లేదన్నారు. ప్రధాని మోడీ స్వంత రాష్ట్రం గుజరాత్‌లో ముస్లింలకు రిజర్వేషన్లు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్లను అడ్డుకుంటే బిసి వ్యతిరేకులుగా మిగిలిపోతారని తెలిపారు. కేంద్ర సర్కారు వెంటనే బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు ఆమోదముద్ర వేయాలన్నారు. అనంతరం జహీరాబాద్ ఎపి సురేష్‌షెట్కార్ జన్మదిన వేడుకలను శివప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేదకుటుంబానికి సిఎంఆర్ఎఫ్ ఎంతో మేలు

-ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త:

ప్రతి పేదకుటుంబానికి సిఎంఆర్ఎఫ్ ద్వారా ఎంతో మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం నర్సాపూర్‌పట్టణ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి చేతుల మీదుగా నియోజకవర్గంలోని పలు మండలాలకుచెందిన బాధిత కుటుంబసభ్యులకు రూ.3,03500/ సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులున్న ప్రతి పేద కుటుంబానికి సిఎంఆర్ఎఫ్ ఎంతో మేలు జరుగుతుంది అన్నారు. కార్యక్రమంలో పట్టణ బల్దియా మాజీ ఉపాధ్యక్షులు నయీం ఉద్దీన్, నాయకులు కవితఅమర్‌సింగ్, సత్యంగౌడ్, షేక్‌హుస్సేన్, మద్దెల జనార్ధన్, మధుకర్‌రెడ్డి, చిరివేళ్ళ ప్రసాద్, బొడ్ల నవీన్‌గుప్త, ఎల్లమయ్య, గుంజరి ప్రవీణ్‌కుమార్, సింగిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మ్రి మహేందర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్, అశోక్‌రెడ్డి, నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

-యూరియా ఎరువులు అందుబాటులో ఉంది

-వ్యవసాయశాఖ ఎడిఏ సంధ్యారాణి, ఎవో దీపిక

నర్సాపూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త:

రైతులకు ఫర్టిలైజర్ దుకాణదారులు ఎరువుల కృత్రిమకొరతను సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఎడిఏ సంధ్యారాణి హెచ్చరించారు. గురువారం నర్సాపూర్‌మండలంలో, పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను ఎడిఏ సంధ్యారాణి, ఎవో దీపికతో కలిసి సందర్శించి తనిఖీచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో రైతులకుసరిపడా యూరియా అందుబాటులో ఉందన్నారు. ఈమేరకు ఎవరైనా దుకాణదారులు ఎరువులను కృత్రిమకొరత సృష్టిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అంతే గాక రైతులు నానోయూరియాను వాడటం మంచిదని తెలిపారు. నానోయూరియా వల్ల నైట్రోజన్ వినియోగ సామర్థ్యం పెరుగుతుందని అధిక దిగుబడి నాణ్యత పెరుగుతుందని, సంప్రదాయ యూరియాపై ఆధారాన్నితగ్గించడం ద్వారా ఖర్చు తగ్గుతుందని, మట్టినీటి కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుతుండటం వంటి ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుందన్నారు. ఈమేరకు నానోయూరియా ఎరువులను ప్రతి పంట సీజన్లో రెండుసార్లు వాడాలన్నారు. ఒకలీటర్ నీటికి రెండో 4మీమీ లీటరు వేయాలన్నారు. విత్తనం వేసిన 25 రోజుల నుండి 30రోజులు తర్వాత పుష్పించే దశలో స్ప్రేచేయాలన్నారు. ఈమేరకు రైతులందరూ నానోయూరియాను వినియోగించి అధిక లాభాలు పొందాలని ఎడిఏ సూచించారు.

రైతుల అభివృద్ధి కోసమే సహకార సంఘాలు

-పిఏసిఎస్ చైర్మన్ అనంతరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పిఏసిఎస్ చైర్మన్ అనంతరెడ్డి, తదితరులు

వెల్దుర్తి. ఆగస్టు 8, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ప్రాథమిక సహకార సంఘంలో శుక్రవారం అర్థమాస వార్షిక ప్రణాళిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఏసిఎస్ సిఈవో అశోక్ 2025-26 సంవత్సరానికి సంబంధించిన పద్దతులను అభివృద్ధి గూర్చి చదివి వినిపించారు. అనంతరం అనంత రెడ్డి మాట్లాడుతూ రైతులు అభివృద్ధి కోసమే సహకార సంఘాలు ఉండడం జరిగిందని అందులో భాగంగానే సహకార సంఘాల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, అలాగే రుణాలను అందించడం జరుగుతుందన్నారు. పిఏసిఎస్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఎన్నో కార్యక్రమాలను సహకార సంఘాల ద్వారా నిర్వహించడం జరుగుతుందని అందుకు రైతులు సహాయసహకారాలు అందించాలన్నారు. రైతులకు కావలసిన రుణాలను సకాలంలో పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. రైతులు సహకార సంఘాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి పథంలో నడవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ వైస్ చైర్మన్ మురళి, డైరెక్టర్లు కృష్ణగౌడ్, రమేష్‌చందర్‌గుప్తా, నర్సింలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాములపర్తిలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు

మర్కుక్, ఆగస్టు 8, ప్రభాతవార్త:

మండలపరిధిలోని పాములపర్తిగ్రామంలో దుర్గామాతకు ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేకల కనకయ్యముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నప్రసాదం అందజేశారు. ఈసందర్భంగా మేకల కనకయ్య మాట్లాడుతూ ప్రతినెలా వచ్చే పౌర్ణమికి దుర్గామాతకు ప్రత్యేకపూజలు నిర్వహించడంతోపాటు భక్తులకు అన్నప్రసాదాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో అనూప్‌కు సన్మానం

గజ్వేల్ టౌన్, ఆగస్టు 8, ప్రభాతవార్త:

పద్మశాలి యువజన సంఘం జిల్లా అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన గాడిపల్లి అనూప్‌ను శుక్రవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు తలకొక్కుల ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ గాడిపల్లి అనూప్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నతపదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పద్మశాలి యువజన సంఘం ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, హనుమాండ్ల నాగరాజు, గుండు మల్లేశం, శేర్ల నర్సింలు, ఏడెల్లి విష్ణువర్ధన్, పెండం వెంకటేష్, వడ్డేపల్లి రమేష్, మెరుగు శ్రీనివాస్, దొంతుల ప్రసాద్, మసన భాస్కర్, పెండం కృష్ణ, దేవసాని హనుమాన్‌దాస్, చిలివేరి వెంకటేష్, బత్తిని నరేష్, శేర్ల సుధాకర్, దేవసాని వాసుదేవ్, ఏడెల్లి మహేందర్ పాల్గొన్నారు.

చేనేత విగ్రహావిష్కరణను విజయవంతం చేసిన అతిథులకు కృతజ్ఞతలు

గజ్వేల్, ఆగస్టు 8, ప్రభాతవార్త:

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో చేనేత మగ్గం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాజారాం, యువజన విభాగం అధ్యక్షుడు తలకొక్కుల ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా లేనివిధంగా చేనేత మగ్గం విగ్రహ ఆవిష్కరణనిర్వహించి విజయవంతం చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమానికి విచ్చేసిన పద్మశాలిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బూర మల్లేశం, పద్మశాలిసంఘం జిల్లా అధ్యక్షుడు సతీష్‌తోపాటు ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితోపాటు పద్మశాలిసంఘం నాయకులకు, కులబాంధవులకు కృతజ్ఞతలు తెలిపారు.

సిఐటియు గెలుపుపై హర్షం

సమావేశంలోమాట్లాడుతున్న సందబోయిన ఎల్లయ్య, బండ్ల స్వామి

గజ్వేల్, ఆగస్టు 8, ప్రభాతవార్త:

సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోగల కిర్బీ పరిశ్రమలో జరిగిన యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో 14ఓట్ల మెజార్టీతో బిఆర్‌టియు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుపై సిఐటియు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు ఘనవిజయం సాధించినట్లు సిద్దిపేట జిల్లా సిఐటియు అధ్యక్ష, ఉపాధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, బండ్ల స్వామి హర్షం వ్యక్తంచేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కిర్బీ పరిశ్రమలో 578 కార్మికులు ఉండగా 576మందికార్మికులు ఓటుహక్కువినియోగించుకున్నారని, సిఐటియుకు 295రాగా, బిఆర్‌టియు యూనియన్‌కు 281ఓట్లు వచ్చాయని, 14ఓట్ల మెజార్టీతో సిఐటియు యూనియన్ గెలుపొందినట్లు తెలిపారు. కార్మికుల చట్టాల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సిఐటియు పోరాటం కొనసాగిస్తుందన్నారు. కార్మికవర్గం సిఐటియుతో అండగా ఉండి హక్కులు సాధించుకోవడానికి కలిసిరావాలని విజ్ఞప్తిచేశారు.

దళిత మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు సరైనవికావు

-దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక, ఆగష్టు 8, ప్రభాతవార్త:

దళిత మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. దుబ్బాకలో సిఎస్ఆర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓట్లకు డబ్బులుపంచి గెలిచిన, అహంకారంతో కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. డబ్బుందనే అహంకారంతో కలెక్టర్లపై, దళిత మంత్రులపై ఇష్టానుసారంగా, మతిభ్రమించినట్లు కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. సత్యం రామలింగరాజు, కాళేశ్వరంప్రాజెక్టులో అవినీతిసొమ్మును కూడబెట్టుకున్న ప్రభాకర్‌రెడ్డి నేడు విమర్శలుచేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితోకలిసి అధికారులపై జులుం ప్రదర్శించడం సరైందికాదన్నారు. పదవికి వన్నెతెచ్చేవిధంగా బక్కి వెంకటయ్య నడుచుకోవాలని చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో దుబ్బాక కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చైతన్యపురికాలనీలో డ్రై డే ఫ్రైడే కార్యక్రమం

నర్సాపూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త:

నర్సాపూర్ మున్సిపాలిటీపరిధిలోని తొమ్మిదోవార్డు చైతన్యపురికాలనీలో శుక్రవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్‌తోపాటు అధికారులు సీజనల్‌వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100రోజుల కార్యక్రమంలోభాగంగా మున్సిపాలిటీపరిధిలోని తొమ్మిదవ వార్డు చైతన్యపురి కాలనీలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహ

కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డికి వాయినం ఇస్తున్న మహిళలు

కార్పొరేటర్ సింధూకు ముత్తయిదువ వాయినం

రామచంద్రాపురం, ఆగస్టు 8, ప్రభాతవార్త: పవిత్ర శావణ మాసం మూడవ శుక్రవారంను పురష్కరించుకుని భారతీ నగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజి కాలనీలోని ఆయా గృహాల్లో వరలక్ష్మి వత్రాల కార్యక్రమాలు భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. డివిజన్ పరిధిలోని ఆయా ఇండ్లలో బిఆర్ఎస్ మహిళలు జరుపుకున్న వరలక్ష్మి వ్రతాల్లో కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డి పాల్గొని పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. డివిజన్ ప్రజలకు వరలక్ష్మి వ్రత శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో తులతూగేలా కరుణించాలని అమ్మవారిని వేడుకున్నట్లు కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డి పేర్కొన్నారు.

ఘనంగా వరలక్ష్మి వ్రతం

వరలక్ష్మి వ్రతాన్ని ఆచరిస్తున్న మహిళా ఉపాధ్యాయినులు

జహీరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త: వరలక్ష్మి వ్రతాన్ని శుక్రవారం జహీరాబాద్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మహిళలు భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని మాణిక్ ప్రభు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినులు విద్యార్థినులతో కలిసి వరలక్ష్మి వత్రాన్ని చేసుకున్నారు. ఇదిలాఉండగా పాఠశాలలో విద్యను అందుకుంటున్న విద్యార్థినులు పాఠశాలలో విద్యను ఆర్జిస్తున్న విద్యార్థులకు రక్షా బంధన్ చేసి నోటిని మిఠాయిలతో తిపి చేసి పండగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వహిందూ పరిషత్ ప్రముఖులు మర్పల్లి రామ్ రెడ్డి వరలక్ష్మి వ్రత విశిష్టతను, రాఖీ పౌర్ణమి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం వెంకటయ్య, ఉపాధ్యాయులు శివశంకర్, ఆరుణ, స్వరూప, మాణిక్యమ్మ, రాజేశ్వరి, సువర్ణ, అనిత, మందాకిని, నాగలక్ష్మి, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

చౌటకూరు మండలంలో...

చౌటకూరు, ఆగస్టు 8, ప్రభాతవార్త: పుల్‌కల్, చౌటకూరు మండలాల్లో శుక్రవారం మహిళలు వరలక్ష్మి వ్రతాలను భక్తిశద్దలతో జరుపుకున్నారు. శ్రావణ మాసంలో మూడవ శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు నోచుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం మహిళలు ఇళ్లను పరిశుభ్రంగా చేసుకుని మామిడి తోరణాలు, రంగురంగు పూలతో అలంకరించుకుని సాంప్రదాయ దుస్తులు ధరించి వరలక్ష్మి వ్రతాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమాలకు హాజరైన ముత్తయిదువులకుమహిళలు భక్తిశ్రద్దలతో వాయినాలు అందించి ఆశీర్వచానలు అందుకున్నారు. వరలక్ష్మి వ్రతాలతో ఆయా గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది.

కొల్చారంలో...

కొల్చారం, ఆగస్టు 8(ప్రభాతవార్త): ప్రతి ఏటా శ్రావణమాసంలో శుక్ల పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తారు. శ్రీ పీఠవాహిని, లోకమాత శంఖుచక్ర గధల్ని ధరించే, మహాలక్ష్మి దేవిని అష్టైశ్వర్య ప్రదాయినిగా కీర్తిస్తారు. శ్రావణమాసంలో ఈ వ్రతాన్ని ఆచరిస్తే అష్టఐశ్వర్యాలు, సకల సుఖాలు, సిద్ధిస్తాయని మహిళల విశ్వాసం, అందుకే వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తారు. కొల్చారంతోపాటు మండల వ్యాప్తంగా శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని మహిళలు ఇండ్లలో వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు అత్యంత భక్తిశ్రద్దలతో ఆచరించారు. మహిళలు లక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రకరకాల పిండి వంటలతో తయారు చేసిన నైవిద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పసుపు కుంకుమలతో వాయినాలను ఇచ్చిపుచ్చుకున్నారు.

కాళికా మాత ఆలయంలో...

కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

మెదక్ టౌన్, ఆగస్టు 7, ప్రభాతవార్త : మెదక్ పట్టణంలోని శ్రీ కాళికామాత ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని సామూహిక వరలక్ష్మి శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శివరామ చార్య ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకం కుంకుమ అలంకరణ మంగళహారతి నిర్వహించారు. అనంతరం దంపతులు వరలక్ష్మి వ్రతం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్వర్ణకార సంఘం సభ్యులు మహిళలు భక్తులు పాల్గొన్నారు.

శ్రీశిశుమందిర్ పాఠశాలలో...

వరలక్ష్మి వ్రతాన్ని జరుపుకుంటున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

కంది, ఆగస్టు 8, ప్రభాతవార్త: మండల కేంద్రమైన కందిలోని శ్రీ సరస్వతి శిశు మందిరం పాఠశాలలో శ్రావణ మాసం మూడవ శుక్రవారాన్ని పురష్కరించుకుని మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్దలతో నోముకునానరు. కార్యక్రమంలో కంది ఆర్టీఓ కార్యాలయం జిల్లా ట్రాన్స్ పోర్ట్ అదికారి అరుణ, ఎక్సైజ్ ఇన్స్ పెక్టర్ రాణి, పాఠశాల బాధ్యులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డవ్వూర్ పాఠశాలలో ఘనంగా రక్షాబంధన్

మనూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త: మండల పరిధిలోని డవ్వూర్ గ్రామంలోని పాఠశాలలో శుక్రవారం రక్షాబంధన్ కార్యక్రమాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు విద్యార్థినులు రాఖీలు కట్టి నోటిని మిఠాయిలతో తీపిచేసి పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పబ్లిక్ టాయిలెట్స్ కొరత...ఇబ్బందుల్లో ప్రజలు

పట్టించుకోని అధికారులు

బస్సుల కోసం వేచి ఉన్న విద్యార్థులు, కూలి కోసం వేచి ఉన్న మహిళల దృశ్యం

గుమ్మడిదల, ఆగస్టు 8 ప్రభాతవార్త : మండల పరిధిలోని స్థానిక బస్‌స్టాప్‌లో పబ్లిక్ టాయిలెట్ లేక మహిళలు, విద్యార్థినిలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.అంబేద్కర్ చౌరస్తావద్ద నాలుగు రోడ్లు కలిసిన అతిపెద్ద కూడలి నల్లవల్లి, కొత్తపల్లి, కానుకుంట, నాగిరెడ్డిగూడెం, వీరారెడ్డిపల్లి, అనంతారం, గుమ్మడిదల, ప్యారానగర్ గ్రామాల పరిధిలోని ప్రజలు ఎక్కడికి వెళ్లాలన్నా ఇక్కడి నుంచే వారి ప్రయాణం సాగించాలి. హైదరాబాద్, మెదక్, మేడ్చల్ వెళ్లాలంటే ఇక్కడి నుంచి ప్రారంభమవుతుంది. చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లోని విద్యార్థిని విద్యార్థులు కళాశాల కోసం ఇతర ప్రాంతాలకు వెళుతూ ఉంటారు. మహిళా కూలీలకు అతిపెద్ద కూలి అడ్డగామారింది. కొడిపల్లి, నర్సాపూర్, రత్నాపూర్ ఇతర గ్రామాల నుంచి ఉపాధి కోసం నిరంతరం ఇక్కడికి వచ్చి ఉపాధి పొందుతున్నారు. హైదరాబాద్, మెదక్, నర్సాపూర్, మేడ్చల్ పట్టణాలలో చదువుకునే విద్యార్థులు ఈ బస్‌స్టాప్ నుంచే కళాశాలకు వెళ్లాల్సి వస్తుంది. మహిళలను దృష్టిలో ఉంచుకొని పబ్లిక్ టాయిలెట్‌లు ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుందన్నారు. బస్‌స్టాప్‌ల వద్ద ప్రత్యేక టాయిలెట్‌ల లేకపోవడం వల్ల పిల్లలు, మహిళలు,విద్యార్థినీ విద్యార్థులు తీవ్ర అసౌకర్యాన్ని అనుభవిస్తున్నారు. గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు పలుమార్లు స్థానిక నాయకులు పంచాయతీకి అర్జీపెట్టినా ఫలితం లేకపోయింది. బస్‌స్టాప్‌ల వద్ద టాయిలెట్ లేకపోవడం వల్ల యువత, మహిళలు తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. అధికార సంస్థలు వెంటనే స్పందించి టాయిలెట్‌లను ప్రస్తుత మున్సిపాలిటీ అధికారులు పట్టించుకొని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జగద్గురు పంచాచార్య బసవ సేవాసదన్‌లో లక్ష బిల్వార్చన

సదాశివపేట, ఆగస్టు 8(ప్రభాతవార్త): సదాశివపేటలో వీరశైవ సమాజం, చౌకి మఠం శ్రీ జగద్గురు పంచాచార్య బసవ సేవా సదన్‌లో శ్రీమద్ కాశీ జ్ఞాన సింహాసనాదీశ్వర 1008 డా. చంద్రశేఖర శివాచార్య మహాస్వామి వారి శ్రావణ మాస ధర్మ ప్రచార, అనుష్టాన, 79వ జన్మదినోత్సవానికి పురస్కరించుకొని ఉదయము మంగళ స్నానము మహిళలచే 79 కలశ జలములచే పాదాభిషేకం, తదుపరి సామూహిక ఇష్టమైన పాదపూజ కార్యక్రమంలో విశేషంగా జన్మదినని పురస్కరించుకొని లక్ష బిల్వర్చన కార్యక్రమం నిర్వహించారు.అర్చకులు 79 జ్యోతులు ఏర్పాటు చేసి జగద్గురువులచే వెలగింప జేశారు. ఈ కార్యక్రమంలో శివాచార్యులు శిగురు సిద్ధమణికంఠ, శివాచార్య, జ్ఞానసిద్ద ఓంకార్, శివాచార్య మహాస్వామి, మల్లికార్జునస్వామి, జగద్గిరిగుట్ట వేదగామ పాఠశాల ప్రధానాచార్యులు సంగయ్యస్వామి, జంగం మహేష్‌స్వామి, పురాణం నాగయ్యస్వామి, విజయస్వామి, కోపూరి విజయకుమార్, బస్వరాజ్, రాములు పాల్గొన్నారు.

శ్రీవాణి స్కూల్‌లో రాఖీ పౌర్ణమి వేడుకలు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 8, ప్రభాతవార్త : జిల్లా కేంద్రంలోని భారత్‌నగర్ శ్రీవాణి స్కూల్‌లో శుక్రవారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్నచెల్లెళ్ళ బంధాన్ని మరింత బలపరచే పర్వదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని శభాకాంక్షలు తెలుపుకున్నారు. పాఠశాలలో టెన్త్ విద్యార్థులు పాఠశాల డైరెక్టర్ సి.హెచ్.సత్యంకు రాఖీ కట్టి స్వీట్లు పంచారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ సత్యం మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి సంప్రదాయంలో ఒక పవిత్రమైన బంధానికి ప్రతీక అన్నారు. సోదరులు, సోదరీమణుల మధ్య ప్రేమ,రక్షణ, నమ్మకానికి గుర్తు అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బయో మెడికల్ విద్యార్థులకు మెడికల్ రంగంలో ఉద్యోగావకాశాలు

క్యాప్ జెమినీతో ఒప్పందం చేసుకుంటున్న బివిఆర్ఐటి కళాశాల ప్రతినిధులు

నర్సాపూర్ ఆగస్టు 8, ప్రభాతవార్త: బయో మెడికల్ విద్యార్థులకు మెడికల్ రంగంలో విస్తృతంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని క్యాప్ జెమినీ సంస్థ వైస్ ప్రెసిడెంట్ అతుల్ కురాని అన్నారు. నర్సాపూర్ సమీపం లోని పి వి ఆర్ ఐ టి ఇంజనీరింగ్ కళాశాలలో క్యాప్ జెమినీ రిక్రూట్‌మెంట్ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా క్యాప్ జెమినీ సంస్థ వైస్ ప్రెసిడెంట్ అతుల్ కురాని మాట్లాడుతూ మెడికల్ రంగంలో ఈ సంవత్సరం 45 వేల మందిని రిక్రూట్ చేసుకున్నామన్నారు. బయో మెడికల్ ఫార్మాస్యూటికల్ ఇంజనీరింగ్ కోర్స్ చదువుతున్న విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాల కోసం ప్రాబ్లం సాల్వింగ్ ఎబిలిటీ, లర్నింగ్ ఎబిలిటీ, నూతన ఆవిష్కరణలు, ఇన్నోవేషన్, క్రియేషన్ ఉన్నప్పుడు హెల్త్ సెక్టార్ లో ఉద్యోగాలు వస్తాయన్నారు. అనంతరం శ్రీ విష్ణు విద్యాసంస్థల, శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కె.వి. విష్ణు రాజు మాట్లాడుతూ తమ కళాశాలలో 28 సంవత్సరాలుగా బయో మెడికల్ కోర్సును నడుపుతున్నట్లు తెలిపారు ప్రైవేట్ రంగాల్లో తెలంగాణలో బయో మెడికల్ కోర్సును నడుపుతున్న ఏకైక సంస్థ బి వి ఆర్ ఐ టి సంస్థ అని తెలిపారు. క్యాప్ జెమినీ సంస్థతో పందెం కుదుర్చుకున్న కార్యక్రమం కళాశాల మేనేజర్ బాపిరాజు. ఏవే ఏవో సురేష్ ల ఆధ్వర్యంలో విజయవంతంగా నడిచింది. ఈ కార్యక్రమంలో క్యాప్ జెమినీ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ సౌరవ్ నారాయన్ బిశ్వన్, విష్ణు విద్యాసంస్థల వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్ దుబే, కళాశాల డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, మేనేజర్ బాపిరాజు, ఏవో సురేష్ లతోపాటు బయో మెడికల్, ఫార్మా స్యూటికల్ విభాగాధిపతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

రైతులు యూరియాను దశలవారీగా వాడాలి : ఎఇవో

వెల్దుర్తి, ఆగస్టు 8 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వెల్దుర్తిలో అగ్రికల్చర్ విస్తరణ అధికారి మస్తీద్ శుక్రవారంనాడు రైతులకు యూరియా పై అవగాహన కల్పించారు. ఒక ఎకరాకి 60 కిలో యూరియాను చల్లలని. ఒకసారి కాకుండా మూడు దఫాలుగా యూరియాను 20 కిలో చొప్పున ఎకరాకి వాడాలని ఆయన రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఈఓ మజీద్ తదితరులు

సింగూరు ప్రాజెక్టును పరిశీలిస్తున్న నీటి పారుదల శాఖ అధికారులు

తాత్కాలిక మరమ్మతులతో పటిష్ట చర్యలు

-నీటి నిల్వలు తగ్గాకే పూర్తి స్థాయిలో పనులు

-సింగూరును సందర్శించిన నీరుపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్

పుల్‌కల్, ఆగస్టు 8, ప్రభాతవార్త: సింగూరు ప్రాజెక్టును తాత్కాలిక మరమ్మతుతో పటిష్టం చేస్తామని నీటి నిల్వలు తాగ్గాకే పూర్తిస్థాయిలో పటిష్టం చేస్తామని నీటి పారుదల శాఖ ఇంజనీర్ న్ ఛీఫ్ అంజద్ హుస్సేన్ తెలిపారు. సహచర నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి శుక్రారం సింగూరు ప్రాజెక్టును సందర్శించారు.సింగూరు ప్రమాదంలో పడలేదని,ఇప్పటికి ఇప్పుడు వచ్చిన నష్టం ఏమి లేదన్నారు. ప్రాజెక్టు కుడివైపు లోపలి భాగంలో ఆనకట్ట రివిట్మెంట్ కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి నిల్వల, వరద ప్రవాహం పూర్తిస్థాయి నీటిమట్టం తదితర విషయాలను స్థానిక ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక విలేఖరులతో అంజద్ హుస్సేన్ మాట్లాడుతూ తాత్కాలికంగా సిమెంట్ బస్తాలు, ఇసుక, కంకర బస్తాలతో దెబ్బతిన్న ఆనకట్ట ప్రాంతాన్ని మరమ్మత్తులు చేస్తామన్నారు. నీటి నిల్వలు అధికంగా ఉంటే పనులు చేపట్టలేమని వెల్లడించారు. ప్రాజెక్టు డేంజర్ జోన్లో లేదని, అక్కడ చేటోచేసుక్న లీకేజీలను సరిచేయిస్తామన్నారు. తాత్కాలిక మరమ్మత్తులకు నిధులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రాజెక్టు సాంకేతిక సమస్యలున్నాయని, సమస్యలను త్వరలోనే సరిచేస్తామన్నారు. నివేదికను పూర్తి అధ్యాయనం చేశాక పకడ్బందీగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ ఈయన్సీ టి శ్రీనివాస్ (ఆపరేషన్ మెయింటర్స్),చీఫ్ ఇంజనీర్ ఎం సత్యనారాయణరెడ్డి, ఈఈ ఎం చంద్రోఖర్ (సెంట్రల్ డిజైన్స్), జిల్లా నీటి పారుదల శాఖ ఈఈ జైభీం, డీఈ నాగరాజు, ఏఈఈలు మహిపాల్‌రెడ్డి, సాలిక తదితరులు పాల్గొన్నారు.

జోవియల్ స్కూల్లో రక్షాబంధన్

యాచారం,ఆగస్టు8, ప్రభాతవార్త :

యాచారం మండల కేంద్రంలోని జోవియల్ హైస్కూల్లో రక్షాబంధన్ పురస్కరించుకొని ఉపాధ్యాయుల విద్యార్థులు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రేఖ శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. రక్షాబంధన్ భారతీయ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపంగా భావిస్తామన్నారు. అన్నా చెల్లెలి అనుబంధానికి ఆత్మీయతలకు మారుపేరన్నారు. పాఠశాలలో విద్యార్థి విద్యార్థినులకు రక్షాబంధనం చేపట్టి కార్యక్రమంలో నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దౌల్తాబాద్,ఆగస్టు 08,ప్రభాతవార్త:

ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని మండలపరిదిలోని ఈర్లపల్లి గ్రామపంచా యితీ కార్యదర్శి బసంత్ అన్నారు.ఈ సంధర్భంగా పంచాయితీ కార్యదర్శి బసంత్ మాట్లాడుతూ... ప్రజలు ఎవరికివారు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.వర్షాకాలంలో ఎలాంటి అంటూవ్యాధులు సోకకుండా ఉండేందుకు ఎవరికివారు ప్రత్యేక శ్రద్దవహించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.తడి,పొడి చెత్తను గ్రామ పంచాయితీ ట్రాక్టర్ లో వేయాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వనమహోత్సవంలో ప్రజలు భాగస్వాములు కావాలి

ఆమనగల్లు, ఆగస్టు8, ప్రభాతవార్త: పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రజలు నడుంబిగించాలని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ అన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతతో మొక్కలు నాటి వాటిని బాధ్యతతో సంరక్షిస్తే భావి తరాలకు పచ్చదనంతో మనుగడకు దోహదపడవచ్చని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆమనగల్లు మున్సిపాలిటి ఆధ్వర్యంలో శుక్రవారం వనమహోత్సవ వేడుకలు నిర్వహించారు. సిబ్బందితో కలిసి కమిషనర్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆదర్శనగర్ కాలనీలో ప్రజలకు మొక్కలు నాటి వాటి ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ సొంతస్థలాల్లో మొక్కలు నాటుకోవాలని ప్రచారం నిర్వహించారు. భూమండలంపై పచ్చదనం పెంపొందించుకుం టేనే జీవరాశుల మనుగడ సాధన సాధ్యమవుతుందన్నారు. మొక్కలు స్వీక రించేందుకు ప్రజలు స్వచ్ఛంధంగా ముందుకు వచ్చారు. అలాగే విఠాయి పల్లిలో అధికారులు మొక్కల పంపిణి కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వార్డు అధికారి సురేందర్, శ్రీధర్‌నాయక్, పర్వతాలు, శంకర్ నాయక్, ఆంజనేయులు, శంకరయ్య, మున్సిపాలిటి సిబ్బంది, ఉన్నారు.

సిగాచి పరిశ్రమ యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

సంగారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 8, ప్రభాతవార్త: 54 మంది ప్రాణాలను బలిగొన్న సిగాచి పరిశ్రమ యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని, నిర్లక్ష్యం వహించిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి రాస్తా రోకో చేపట్టారు. ఈ సందర్భగా సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు మాట్లాడుతూ మృతి చెందిన కార్మికుల డెత్ సర్టిఫికెట్‌లను వారి కుటుంబ సభ్యులకు అందచేయాలన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. క్షతగాత్రులైన కార్మికులకు 50 లక్షల రూపాయలను అందచేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కర్మాగార యాజమాన్యం మృతులకు కోటి రూపాయలు, క్షతగాత్రులకు 10 లక్షలు ఇస్తామని బహిరంగంగా హామి చేసినా ఇంత వరకు పూర్తిస్థాయిలో పరిహారం అందించకపోవడం తగునా అని నిలదీశారు. నష్టపరిహారం అందుకు నేందుకు డెత్ సర్టిఫికెట్ అడుగుతున్నారని,అందుకు మృతుల కుటుంబ సభ్యులకు డెత్ సర్టిఫికెట్లు అందచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 2 లక్షల రూపాయలను బాధిత కుటుంబాల్లో ఏ ఒక్కరికి అందలేదని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే సిగాచి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సాయిలు, నర్సింలు, జిల్లా కమిటి సభ్యులు యాదగిరి, కృష్ణ, నాయకు అశోక్, మహేష్, దత్తు, శివ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

న్యాల్‌కల్ మండలంలో ఎమ్మెల్యే పర్యటన

న్యాల్‌కల్, ఆగస్టు 8, ప్రభాతవార్త:

మండల పరిధిలోని రాఘవాపూర్, చాల్కి, హుమ్నాపూర్ గ్రామాలను శుక్రవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పర్యటించి పార్టీ శ్రేణులతో ముచ్చటించారు. పార్టీ అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలపై కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మున్నూర్ రవీందర్, నాయకులు అశోక్‌పాటిల్, సుధాకర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, మల్లయ్య, ఖైరుద్దీన్‌పటేల్, దత్తురెడ్డి, అశోక్, రాజు, శ్రీకాంత్, వీర్‌శెట్టి, అనిల్, ఫయాజ్, రమేష్, జీవన్‌రెడ్డి, వెంకట్, సిద్దరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, ప్రకాష్, సిద్దయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎఐటియుసి నాయకులకు సన్మానం..

ఎఐటియుసి నేతలను సన్మానం చేస్తున్న డాక్టర్ బాబు

నారాయణఖేడ్, ఆగస్టు 8, ప్రభాతవార్త : ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శిగా ఆనంద్, ఉప ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన చిరంజీవిని, కార్య వర్గ సభ్యులుగా ఎన్నికైన అశోక్‌లను ఇండియన్ నేషనల్ ఉమెన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బాబు సన్మానించడం జరిగింది. ప్రజలకు మరిన్ని అండే విధంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజల పట్ల నిరంతరం పోరాటం చేయడంపై ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బసవరాజ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు మొబైల్ ఫోన్ అందచేత

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను అందచేస్తున్న ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్

ఝరాసంగం, ఆగస్టు 8, ప్రభాతవార్త: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను బాధితుడికి ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ శుక్రవారం అందచేశారు. సెల్ ఫోన్‌ను పోగొట్టుకుంటే సిఐఈఆర్ ద్వారా మొబైల్ ఫోన్‌లను పట్టుకోవడం జరుతుందని, బాధితులు వెంటనే ధరఖాస్తు చేసుకుంటే ప్రయోజనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ వంశీ బాధితులు ఉన్నారు.

ఎస్ఐని సన్మానించిన ముస్లింలు

మహమ్మద్ మోహినోద్దీన్ శాలువలతో సన్మానించిన ముస్లింలు

కొల్చారం, ఆగస్టు 8(ప్రభాతవార్త): మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ మోహినోద్దీన్‌ను శుక్రవారం స్థానిక ముస్లింలు పోలీస్ స్టేషన్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహమ్మద్ మోహినోద్దీన్‌ను మైనార్టీలు శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ ఇమామ్ మహమ్మద్ ఈసాక్, ఖదీర్, ఫైయజ్, మున్ను, రియాజ్, యునుస్, సమీర్, హైమద్, ఆర్షద్, మహబూబ్, సయ్యద్ ఫాహద్ పాషా, అదిల్ తదితరులు పాల్గొన్నారు.

రామయంపేటలో వేస్ట్ డీకంపోజర్ తయారీపై రైతులకు అవగాహన

రామాయంపేట మున్సిపాలిటీ, ఆగస్టు 8, ప్రభాతవార్త :

రామయంపేట మండలం, పట్టణానికి చెందిన రైతు రాజుకు చెందిన పొలంలో శుక్రవారం వేస్ట్ డీకంపోజర్ ద్రావణం తయారీపై క్షేత్రస్థాయి ప్రదర్శన, అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్‌చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు రాజనారాయణ రైతులతో మాట్లాడుతూ, వేస్ట్ డీకంపోజర్ వాడకం వల్ల కలిగే అద్భుతమైన ప్రయోజనాలను వివరించారు. వేస్ట్ డీకంపోజర్ అనేది ఒక జీవన ద్రావణం(బయో సొల్యూషన్) అని, ఇది వ్యవసాయ వ్యర్థాలను త్వరగా కుళ్ళింపజేసి విలువైన సేంద్రియ ఎరువుగా మారుస్తుందని ఆయన తెలిపారు. దీనివల్ల పొలంలో సేంద్రియ పదార్థాలు పెరిగి, నేల సారవంతంగా మారుతుందని చెప్పారు. వేస్ట్ డీకంపోజర్ వాడకం వల్ల కలిగే ముఖ్య లాభాలను వివరించారు. ముఖ్యంగా ఖర్చుల తగ్గింపు, నేల ఆరోగ్యం మెరుగుదల, నీటి ఆదా, పోషకాల లభ్యత, పర్యావరణ పరిరక్షణ లాంటి లాభాలు కలుగుతాయని అన్నారు. వేస్ట్ డీకంపోజర్ వ్యవసాయానికి ఒక చక్కని పరిష్కారమని, ఇది పర్యావరణానికి హాని కలిగించకుండా, తక్కువ ఖర్చుతో అధిక లాభాలను అందిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మరియు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.